## నార్మల్ నెయ్యితోనే గుట్ట ప్రసాదాలు

- సూత్రప్రాయంగా అంగీకరించిన దేవస్థానం
- విడుదల కాని జీఓ

యాదగిరిగుట్ట, జనవరి 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి సరఫరాను నార్మల్ డెయిరీ సంస్థనే కొనసాగించాలని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ సూత్రప్రాయంగా అంగీకరించినా ఇందుకు సంబంధించిన జీఓ విడుదల కాలేదు. నార్మల్ టెండర్‌ను రద్దు చేసి విజయ డెయిరీని వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి విధితమే. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం జనవరి ఒకటి నుంచి నార్మల్ సంస్థను రద్దు చేసి విజయ డెయిరీ నెయ్యిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే నార్మల్ టెండర్ రద్దవకుండా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విన్నవించుకుని నార్మల్ సంస్థను కాపాడే ప్రయత్నం ముమ్మరం చేసినట్లు తెలిసింది. యాదగిరిగుట్టతో పాటు చెర్వుగట్టుకు సైతం ఇదే నెయ్యి కొనసాగించాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఆలయానికి నెయ్యి సరఫరా చేసేందుకు గతేడాది టెండర్లు వేయగా ఎల్– 1 గా నిలిచిన నార్మల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో విజయ డెయిరీ కూడా పాల్గొనగా అర్హత సాధించలేదు. టెండర్ ప్రకారం మార్చి నెలాఖరు వరకు నార్మల్ సంస్థ ఆలయానికి నెయ్యి సరఫరా చేయాల్సి ఉంది. అర్ధాంతరంగా టెండర్‌ను రద్దు చేస్తే న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి ఉంటుందన్న ఆలోచనతో మార్చి 31 వరకు యాదగిరిగుట్ట ఆలయానికి నార్మల్ డెయిరీ నెయ్యినే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు మాత్రం నార్మల్ డెయిరీ నెయ్యినే శాశ్వతంగా కొనసాగించాలని, ఇందుకు సంబంధించి జీఓను విడుదల చేయాలని కోరుతున్నట్లు తెలిసింది.

## శివరామ్‌కు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి నివాళి



శివరామ్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

రామన్నపేట, డిసెంబర్ 2 : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన కొండగడప శివరామ్ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గురువారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, బాలగోని నర్సింహ, ఆమేర్, పట్టణ కార్యదర్శి జాడ సంతోశ్, నాయకులు ఎస్కే చాంద్, ఆవుల శ్రీధర్, బొడ్డు అల్లయ్య, నోముల లింగస్వామి, కొండగడప చింటు తదితరులు ఉన్నారు.



మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ మొగులగాని మల్లేశం

## లాభాల్లో ఆలేరు పీఏసీఎస్ : చైర్మన్ మల్లేశం

ఆలేరు టౌన్, జనవరి 2 : పట్టణ పీఏసీఎస్ రూ.కోటి వరకు లాభాల్లో ఉందని చైర్మన్ మొగులగాని మల్లేశం అన్నారు. పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మహాజన సభలో ఆయన హాజరై మాట్లాడారు. సంఘం పరిధిలో 18 గ్రామ పంచాయతీలు, 1 మున్సిపాలిటీ ఉండగా మొత్తం 6,528 మంది సభ్యులు, వారి వాటా రూ.2,14,87,653 ఉందన్నారు. రూ.70లక్షలు సంఘంలో ఉండగా, రూ.30లక్షలు ఎన్‌డీసీసీ 444 రోజులకు ఎఫ్‌డీ చేసినట్లు పేర్కొన్నారు. సేవింగ్స్‌లో రూ.51,40,000 లక్షలు ఉన్నాయని తెలియజేశారు. సంఘం నుంచి పంట రుణం తీసుకున్న సభ్యులు 1,636 మంది కాగా, మొత్తం రుణం రూ.11,64,37,677 రావాల్సి ఉందన్నారు. ఎరువుల ద్వారా రూ.78,00,046, విత్తనాల ద్వారా రూ.4,14,640 వ్యాపారం చేసినట్లు పేర్కొన్నారు. ఆలేరు పీఏసీఎస్ అభివృద్ధి చెందడానికి డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తోడ్పాటు నందించారని చెప్పారు. మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్ని గ్రామాల చెరువులు నింపుతున్నారు కానీ కొలనుపాక, రాఘవాపురం చెరువులను నింపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పాలనలోనే రైతులు లాభ పడ్డారని, రైతు నాయకుడిగా కేసీఆర్ తెలంగాణ చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చింతకింది చంద్రకళామురళి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొరిగాడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పద్మశాలీ సంఘం మండల నూతన కమిటీ



గుండ్లగూడెంలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆలేరురూరల్, జనవరి 2 : పద్మశాలీ సంఘం నూతన మండల కమిటీని గురువారం మండలంలోని గుండ్లగూడెం కేబీఆర్ గార్డెన్‌లో గురువారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా సామల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా అమృతం నర్సింహులు, చింతకింది బలరాం, గుండు భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా అంకం రాజు, కోశాధికారిగా అంకం మల్లేశం, కార్యదర్శులుగా ఎలగండ్ల రామరుషి, కురి మార్కండేయ, ప్రచార కార్యదర్శిగా ఎలగందుల సిద్ధులు, కార్యవర్గ సభ్యులుగా తదితరులను ఎన్నుకున్నారు.

## పోచంపల్లి ఇన్‌చార్జి తాసీల్దార్‌గా నాగేశ్వర్‌రావు



నాగేశ్వర్‌రావును అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భూదాన్‌పోచంపల్లి, జనవరి 2 : మండల ఇన్‌చార్జి తాసీల్దార్‌గా డీటీ నాగేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐలు వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు కళాశాలకు రావాలని పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం



విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధ్యాపకులు

నేరేడుచర్ల, జనవరి 2: ఇంటర్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వినూత్నంగా ప్రయత్నించారు. గురువారం గరిడేపల్లి, పొనుగోడు, అబ్బిరెడ్డిగూడెం తదితర గ్రామాల నుంచి కళాశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇండ్లకు వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి కళాశాలకు క్రమం తప్పకుండా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మద్దిమడుగు సైదులు, కర్నాటి శ్రీనివాస్, ప్రసాద్, నర్సింహాచారి, అపర్ణ పాల్గొన్నారు.

## 4న కొబ్బరికాయల విక్రయానికి వేలం

మఠంపల్లి, జనవరి 2: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయం, కొబ్బరిచిప్పల సేకరణ, దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 4వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ గురువారం తెలిపారు. టెండర్ షెడ్యూల్ ధర రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.



భువనగిరి సివిల్ సప్లయ్ గోదామ్ వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు, చిత్రంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



రామన్నపేటలో సమ్మె చేస్తున్న హమాలీలు

## కూలి పెంపు జీఓను విడుదల చేయాలని

# హమాలీల నిరసన

భువనగిరి అర్బన్, జనవరి 2 : కూలి రేట్ల పెంపు జీఓను విడుదల చేయాలని పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదామ్ వద్ద హమాలీ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతూ సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పెంచిన కూలి రేట్ల జీఓను వెంటనే విడుదల చేసి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి రేట్లను పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి రేట్ల పెంపునకు ఒప్పందం జరుగుతుందని, 4 అక్టోబర్ 2024 నాటికి రెండేళ్లు దాటి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీ సమ్మెతో ప్రజలకు రేషన్‌బియ్యం అందడం లేదని, ప్రభుత్వం స్పందించి జీఓను విడుదల చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఇమ్రాన్, కార్యవర్గ సభ్యుడు సామల శోభన్‌బాబు, హమాలీ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బస్వయ్య, పిన్నం జగన్, ముడుగుల స్వామి, సత్యనారాయణ, గణేశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

### రామన్నపేటలో

రామన్నపేట : మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదామ్ వద్ద హమాలీలు చేపట్టిన సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె నర్సింహ, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ మద్దతు తెలిపి ప్రారంభించారు. కార్యక్రమంలో శివరాత్రి సమ్మయ్య, బండ స్వామి, తోటకూర అంజయ్య, నగేశ్, అచ్చాలు, రవి, పెంటయ్య, వెంకటేశ్, ఉప్పలయ్య, మహేశ్ పాల్గొన్నారు.

### జీఓను విడుదల చేయాలి : ఏఐటీయూసీ

మోత్కూరు : హమాలీ కార్మికులకు పెంచిన కూలి ధరల జీఓను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. పట్టణంలో సివిల్ సప్లయ్ హమాలీలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోదామ్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సామల శోభన్ బాబు, నాయకులు మల్లేశ్, జంగ నర్సయ్య, గొలుసుల యాదగిరి, పురుగుల రవి, మారయ్య, జీడయ్య, రమేశ్ పాల్గొన్నారు.

## ఆవిష్కరణలతో ఆలోచనలను పెంపొందించుకోవాలి

- డాక్టర్ జయేశ్ రంజన్



అశోకా ఇంజినీరింగ్ కాలేజీలో ఇంక్యుబేటర్ హబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ జయేశ్ రంజన్

చౌటుప్పల్‌రూరల్, జనవరి 2 : విద్యార్థులు వ్యాపార పరమైన నూతన ఆవిష్కరణలు, ఆలోచనలను పెంపొందించుకోవాలని పరిశ్రమలు, వాణిజ్య సమాచార సాంకేతిక కమ్యూనికేషన్ విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయేశ్ రంజన్ అన్నారు. చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపురం గ్రామ పరిధిలో అశోకా గ్రూప్ అఫ్ ఇన్‌స్టిట్యూషన్‌లో ఇంక్యుబేటర్ హబ్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికారులు రమాదేవి, వినూతా నాగరాళ్లపల్లి, ప్రొఫెసర్ లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.



దేవదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ శ్రీధర్‌ను కలిసిన టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

## దేవస్థానం ఉద్యోగుల బదిలీపై పునరాలోచన చేయాలి

- టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

యాదగిరిగుట్ట, జనవరి 2 : రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో పని చేసే ఉద్యోగులు, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్న వారితో పాటు జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌ల బదిలీపై పునరాలోచన చేయాలని టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. బదిలీల్లో భాగంగా ప్రమోషన్ పొంది బెనిఫిట్స్ పొందలేకపోతున్న ఉద్యోగులకు వెంటనే అమలయ్యే విధంగా చొరవ చూపాలని కోరారు. దీంతో కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన దేవాలయ ఉద్యోగ జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేశ్‌బాబు, యాదగిరిగుట్ట దేవస్థాన ఏఈఓలు జూశెట్టి కృష్ణ, ప్రతాప్ నవీన్‌కుమార్, దాసోజు నరేశ్, పర్యవేక్షకులు దయానంద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని వినతి



తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రెడ్లరేపాక గ్రామస్తులు

వలిగొండ, జనవరి 2 : మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించకుండా చర్యలు తీసుకొని హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని తాసీల్దార్ పి.శ్రీనివాస్ రెడ్డికి గురువారం గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని అక్రమిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో దేశబోయిన సూర్యనారాయణ, నోముల మల్లేశం, దేశబోయిన మల్లేశం, పంతంగి కిష్టయ్య, బద్దం నర్సింహ, సిరికొండ జహంగీర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్స్ అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆలేరురూరల్, జనవరి 2 : మండలంలోని టంగుటూరు జడ్పీహెచ్‌ఎస్‌లో లయన్స్ క్లబ్ గ్రేటర్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ స్టడీ మెటిరియల్‌ను సద్వినియోగం చేసుకొని బాగా చదివి 10జీపీఏ మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పరుశరాములు, శ్రీనివాస్, శ్రీకాంత్, రమేశ్, రామకృష్ణ, రమణచారి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## విధులకు హాజరుకాని టీచర్లపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

భువనగిరి అర్బన్, జనవరి 2 : విధులకు హాజరుకాని ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శివ, కార్యదర్శి రాజు అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలన్నారు. ఉపాధ్యాయులు విధులకు హాజరు కాకుండా ప్రతి నెలా జీతాలు తీసుకుంటున్న 16 మంది ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి తొలగించడం సరైందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, సభ్యులు శ్రీనివాస్, ఉదయ్, నరేందర్ పాల్గొన్నారు.

## కోర్టులో నూతన సంవత్సర వేడుకలు



జూనియర్ సివిల్ కోర్టులో వేడుకల్లో పాల్గొన్న బార్ అసోసియేషన్ సభ్యులు

యాదగిరిగుట్ట, జనవరి 2 : పట్టణ జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో జూనియర్ సివిల్ జడ్జి కవిత కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు గుడ్ల స్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూకంటి రవీందర్, న్యాయవాదులు రాజిరెడ్డి, సాయికృష్ణ, పెంట రమేశ్, వీరస్వామి, కృష్ణ, గణేశ్, సంతోష, రేణుక, నవిత, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి : ఎంవీఐ ఆనంద్



మాట్లాడుతున్న ఎంవీఐ ఆనంద్ శ్యామ్‌ప్రసాద్

ఆలేరు టౌన్, జనవరి 2 : విద్యార్థి దశలో ఉన్నప్పుడే రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని భువనగిరి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆనంద్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. పట్టణంలోని జేఎంజే స్కూల్లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపొద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపితే నేరమని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఆర్టీఓ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్య సేవలను అందించాలి : శ్రీనివాస్



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ రాష్ట్ర కన్సల్టెంట్ శ్రీనివాస్

భువనగిరిక లెక్టరేట్, జనవరి 2 : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ రాష్ట్ర కన్సల్టెంట్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బొల్లేపల్లి, అనంతారం గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీణ తదితరులున్నారు.

## విద్యార్థులకు పరిశుభ్ర ఆహారం అందించాలి

- ప్రత్యేకాధికారి రాజారాం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం

ఆత్మకూరు(ఎం), జనవరి 2 : విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. మండలంలోని కూరెళ్ల ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం మిరియాల దామోదర్, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలున్నారు.

## ముగిసిన ఊరూరా ఆరోగ్య సమ్మేళనం



రుద్రవెల్లి గ్రామంలో సైన్స్ ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

బీబీనగర్, జనవరి 2 : మండల కేంద్రంలోని కిడ్స్ కింగ్‌డమ్ గ్రామర్ హై స్కూల్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో డిసెంబర్ 27 నుంచి ప్రారంభించిన ఊరూర ఆరోగ్య సమ్మేళన కార్యక్రమం గురువారం ముగిసింది. మండలంలోని రుద్రవెల్లి గ్రామంలో చివరి రోజు ఆరోగ్య సమ్మేళన సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మన్నె రాజేందర్, పూర్వ విద్యార్థులు మహేశ్, దోసపాటి మహేశ్, కర్షక నవీన్ కుమార్, జిల్కపల్లి మధు, ఉపాధ్యాయులు సునీల్ సుధాకర్, బాబు ఖాన్, మోహన్ దాస్, అరవింద్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇంటి ముందు ముగ్గు చెడగొట్టిన ఐదుగురిపై కేసు

మునగాల, జనవరి 2: ఓ ఇంటి ముందు వేసిన ముగ్గును చెడగొట్టడంతో పాటు ఇంట్లోని వారిని భయభ్రాంతులకు గురి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మునగాల గ్రామానికి చెందిన చిత్తలూరి సీతారాం, ఆయన భార్య నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 31 అర్ధరాత్రి తర్వాత ఇంటి ముందు ముగ్గు వేశారు. వారు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మునగాల గ్రామానికి చెందిన మానుపాటి గోపి, తురక మధు, బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మందుల దినేశ్, షేక్ సాధిక్, మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన పాల్వాయి విద్యాసాగర్ అనే ఐదుగురు సీతారాం ఇంటి ముందు వేసిన ముగ్గును చెడగొట్టడంతో పాటు బల్బులను పగులగొట్టి ఇంట్లోని వారిని భయభ్రాంతులకు గురి చేశారు. ఈ మేరకు సీతారాం ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బస్సు నుంచి పడి వృద్ధుడి మృతి

ఆలేరు టౌన్, డిసెంబర్ 2 : పట్టణంలో బస్సు దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి గురువారం వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పట్టణ పరిధిలోని బహదూర్ పేటకు చెందిన సంఘీ ఎల్లయ్య (60) వ్యక్తిగత పని నిమిత్తం భువనగిరి నుంచి ఆలేరుకు వస్తున్నాడు. పట్టణంలోని రైల్వే గేటు వద్ద బస్సు దిగాల్సి ఉండగా ఎల్లయ్య మెట్ల వద్ద నిల్చున్నాడు. డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో పట్టు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో ముక్కుకు గాయాలై తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఆలేరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రజనీకర్ తెలిపారు.

## ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), జనవరి 2 : మండల కేంద్రానికి చెందిన లారీ డ్రైవర్ గట్టు అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఒక కాలును కోల్పోయాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అశోక్‌ను ఆదుకోవాలని మన ఆత్మకూరు(ఎం) అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా పలువురిని కోరగా.. గ్రామానికి చెందిన యాస గోర్ధన్‌రెడ్డి స్పందించారు. 95 మంది నుంచి రూ.6వేలను జమ చేసి గురువారం బాధితుడికి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జన్నాయికొడె నగేశ్, బీసు చందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, భిక్షపతి, రాజు, మల్లేశం, లింగయ్య, రాంబాబు, కనకయ్య, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

సూర్యాపేట రూరల్, జనవరి 2: ఇరువర్గాల నడుమ ఘర్షణ తలెత్తిన ఘటన పట్టణ పరిధిలోని 13 వార్డు గాంధీనగర్ సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన బాలెంల నాగమ్మ, జక్కలి రమేశ్ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద కిరాణా షాపులు నిర్వహిస్తున్నారు. షాపుల నిర్వహణ విషయంలో వారి కుటుంబాల నడుమ ఘర్షణ తలెత్తడంతో నాగమ్మ, రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

## 'రుణమాఫీ పూర్తి చేయాలి'

గరిడేపల్లి, జనవరి 2: రాష్ట్రంలో పలువురు రైతులు ఇంకా రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేలాది మంది రైతులు రుణమాఫీ కోసం బ్యాంకులు, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలనే సోయి లేకపోవడం విచారకరమన్నారు. మాఫీ కాకపోవడంతో రూ.2 లక్షల పైబడి రుణం తీసుకున్న రైతులపై బ్యాంకులు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## 'ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి'

సూర్యాపేట టౌన్, జనవరి 2: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారసాని చంద్రకళ, కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కోటాచలంకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు.సూరం రేణుక, సంతోషిమాత పాల్గొన్నారు.